క్లుప్తంగా

సూర్యప్రకాశరావు సేవలు ఎనలేనివి



ఫిరంగిపురం: స్వర్ణసూర్య ప్రకాశరావు ప్రజలకు చేసిన సేవలు ఎనలేనివని ఎక్సైజ్ డీఎస్పీ దాసరి బాలయ్య అన్నారు. మండలంలోని గొల్లపాలెం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు స్వర్ణ సూర్యప్రకాశరావు పదో వర్ధంతి ఆదివారం నిర్వహించారు. సూర్యప్రకాశరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బాలయ్య మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి సూర్యప్రకాశరావు ఎంతో పాటుపడ్డారని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ మెల్కియా, కుటుంబ సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు స్వర్ణ చిన్నప్ప, థామస్, ఫ్రాన్సిస్, వెలంగిణీరాజు, మహేష్, రైస్‌కుమార్ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీపై దుష్ప్రచారం తగదు

దుగ్గిరాల: వక్ఫ్ సవరణ బిల్లుకు పార్లమెంట్‌లో వ్యతిరేకంగా ఓటు వేసిన వైఎస్సార్ సీపీపై కొందరు కావాలని సామాజిక మాధ్యమాల్లో అసత్య ప్రచారం చేయడం తగదని వైఎస్సార్ సీపీ మైనార్టీ నాయకులు షేక్.సుభాని అన్నారు. దుగ్గిరాలలో ఆదివారం సమావేశం నిర్వహించి, మాట్లాడారు. వక్ఫ్ సవరణ బిల్లుకు మద్దతు తెలిపిన టీడీపీపై మైనార్టీల్లో వ్యతిరేకత రావడంతో దిక్కుతోచని స్థితిలో వైఎస్సార్ సీపీపై దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఇలాంటి అసత్య ప్రచారాలు మానుకోకపోతే ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. రషీద్ సాహెబ్, మస్తాన్ పాల్గొన్నారు.

బీటీ రణదీవేకి ఘన నివాళి



తాడేపల్లి రూరల్ : సీఐటీయూ వ్యవస్థాపక అధ్యక్షుడు బీటీ రణదీవే 35వ వర్ధంతి వేడుకలను ఆదివారం తాడేపల్లి పట్టణ పరిధిలోని ప్రకాష్‌నగర్‌లో ఘనంగా నిర్వహించారు. రణదీవె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. 1970 దశకంలో అనేక ఒడిదుడుకులు ఎదుర్కొని కార్మిక సంఘం ఏర్పాటుకు బీటీ రణదీవే కీలక పాత్ర పోషించారని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు వేముల దుర్గారావు, బి.ప్రభాకరరావు, బాబూరావు, వెంకటేశ్వర్లు, వెంకన్న, సూరి, అంకయ్య, నవనీతం, ఆశీర్వాదం, రమణ, వేణు, ఎస్‌కె జానీ, సాంబయ్య పాల్గొన్నారు.

స్వచ్ఛంద సేవకు నూతన ఆటో ప్రారంభం



తెనాలి: పట్టణానికి చెందిన స్వచ్ఛంద సేవాసంస్థ యంగ్ జనరేషన్ టీమ్ సేవల కోసం సమకూర్చుకున్న నూతన ఆటోను ఆదివారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ప్రారంభించారు. రానున్న రోజుల్లో సేవాకార్యక్రమాల నిర్వహణకు, నిరుపేద ప్రజలకు తక్కువ ధరలో సేవకు ఆటో అందుబాటులో ఉంటుందని సంస్థ అధ్యక్షుడు సాదిక్ తెలిపారు. స్థానిక గంగానమ్మపేటలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ నాయకులు కఠారి హరీష్, విజ్ఞాన్ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ సయ్యద్ ఇర్షాన్, సాదిక్, నవీన్, శివ, యంగ్ జనరేషన్ టీం సభ్యులు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం

తెనాలి: శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా శ్రీ వెంకటేశ్వర యోగా సేవా కేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక రైల్వేస్టేషను సెంటరులో పేదలకు అన్నదానం చేశారు. కేఎల్ఎస్ వారి అమ్మ ఫ్రూట్స్, మొవ్వా పున్నయ్య, సుహాసిని కుటుంబసభ్యుల సహకారంతో ఈ వితరణను చేశారు. 36వ వార్డు కౌన్సిలర్ తాడిబోయిన బ్రహ్మం, ప్రధానోపాధ్యాయుడు కుర్రా శ్రీనివాసరావు మాట్లాడారు. కార్యక్రమంలో మొవ్వా వెంకటశివయ్య, మహాలక్ష్మి, కరీముల్లా బాబు, విజయలక్ష్మి, అన్నదాత సుఖీభవ సభ్యులు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం

తెనాలి రూరల్: ఆల యానికి వెళ్లిన వివాహిత అదృశ్యమవడంపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణానికి చెందిన కోగంటి రాంబాబు, శారద దంపతులు సుల్తానాబాద్ ఆలపాటి నగర్‌లో హోటల్ నిర్వహిస్తున్నారు. వైకుంఠపురం ఆలయానికి వెళ్లి వస్తానని శనివారం ఉదయం ఆరు గంటలకు ఇంటి నుంచి వెళ్లిన శారద తిరిగి రాలేదు. భర్త పోలీసులను ఆశ్రయించడంతో త్రీ టౌన్ ఏఎస్ఐ హైదర్ అలీ ఆదివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మట్టి కుండలకు పుట్టినిల్లు

- మంగళగిరిలో కుల వృత్తిపై 300 కుటుంబాల జీవనం
- ఇతర ప్రాంతాలకూ మట్టి పాత్రల ఎగుమతి
- వేసవిలో కుండలకు పెరిగిన గిరాకీ
- నగర విస్తరణతో ముడి సరుకు ఎర్రమట్టి కొరత
- ప్రభుత్వ ప్రోత్సాహం కావాలంటున్న తయారీదారులు



కుండకు తుది రూపం దిద్దుతున్న దృశ్యం



బట్టీలో కుండలను కాలుస్తున్న తయారీ దారుడు

తాడేపల్లి రూరల్ : పేదవాడి ఫ్రిడ్జ్‌గా పేరుగాంచిన మట్టి కుండలు, బానలు ఇతర పాత్రలకు వేసవిలో గిరాకీ ఉంటుంది. వీటి తయారీకి మంగళగిరి పుట్టినిల్లుగా పేరుగాంచింది. కుండలు తయారు చేసే 300 కుటుంబాలు మంగళగిరి పట్టణంలో ఉన్నాయి. ఇప్పటికీ చాలామంది కుల వృత్తిని వదులుకోకుండా కుండలు తయారు చేస్తున్నారు.

కులవృత్తే జీవనాధారం

గుంటూరు జిల్లా వ్యాప్తంగా మంగళగిరి కుండలు పలు గ్రామాలకు పంపించడంతో పాటు రాష్ట్రంలోని పలు జిల్లాలకు కూడా ఇక్కడి నుంచి కుండలు ఎగుమతి చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వేసవిలో మట్టి కుండలకు ఆదరణ ఉండడంతో ఉత్సాహంగా కుండల తయారీ చేపడుతున్నారు. వేసవి అనగానే చల్లని నీటిని అందించే మట్టి కుండలు గుర్తుకు వస్తాయి. ఆములో కాల్చి బయటకు తీసిన తాజా కుండలు ఎండలను ఎదుర్కొనేలా సిద్ధం చేస్తున్నారు. ప్రస్తుతం అధిక కుటుంబాలు ఈ వృత్తిపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నాయి. ప్రతిరోజూ ఇంటిల్లిపాది కష్టపడితే 15 కుండల వరకు సిద్ధం చేయవచ్చని వృత్తిదారులు చెబుతున్నారు. 10 రోజుల పాటు సిద్ధం చేసిన వాటిని ఒక రోజు బట్టిలో ఉంచి కాల్చుతారు. ఒక కుండ రూ. 100 వరకు ధర పలుకుతోంది. ఆ మేరకు ప్రతి రోజు రూ. 500 వరకు కూలి ఉంటుందని చెబుతున్నారు.

ఇతరత్రా మట్టిపాత్రలు ఇక్కడి నుంచి ఎగుమతి చేస్తున్నారు.

మట్టి కొరత

మంగళగిరి రెండు మహా నగరాల మధ్య ఉండడం, రాజధాని ప్రాంతం కావడంతో ప్రస్తుతం కుండల తయారీకి ఎర్రమట్టి కొరత ఏర్పడింది. గతంలో ఆత్మకూరులో కుండలు తయారుచేసే వారికి ప్రత్యేకంగా ఒక చెరువును కేటాయించారు. కాలక్రమేణా ఆ చెరువులో ఎర్రమట్టిని ఇతరులు తీసుకెళ్లడం, ఆ స్థలం ఆక్రమణకు గురికావడంతో మట్టి కొరత ఏర్పడింది. దీంతో తయారీ దారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



తయారుచేసిన కుండలు

30 ఏళ్ల నుంచి ఈ వృత్తిలో ఉన్నా



నేను ఈ వృత్తిలో 30 ఏళ్లుగా ఉన్నాను. ఈ ఏడాది కుండలు, కూజ వ్యాపారం పర్వాలేదనిపిస్తోంది. మంగళగిరి నుంచి గుంటూరు, ప్రకాశం, కోదాడ, ఏలూరు, గోదావరి జిల్లాలతో పాటు తెలంగాణకు కూడా ఇక్కడి నుంచి మట్టి పాత్రలు ఎగుమతి చేస్తాం.

– కానూర్ల వెంకటేశ్వరరావు, మంగళగిరి

షెడ్లకు సహకరించాలి



వేసవి కాలం కుండల తయారీకి అనుకూలం. వర్షాకాలం కష్టపడి తయారు చేసిన కుండలపై చినుకు పడినా మొత్తం పాడైపోతాయి. దీంతో చాలా నష్టపోతున్నాం. ప్రభుత్వం స్పందించి షెడ్లను ఏర్పాటు చేయాలి.

– అంజిబాబు, మంగళగిరి

రుణాలు మంజూరు చేయాలి



మా వృత్తి ప్రోత్సాహకానికి ప్రభుత్వం రుణాలు మంజూరు చేయాలి. దీంతో వ్యాపారం అభివృద్ధి చేసుకోవడానికి ఉపయోగకరంగా ఉంటుంది. ఇతర జిల్లాలకు కుండలను ఎగుమతి చేస్తున్నాం. మారుతున్న కాలానికి అనుగుణంగా పలు రకాల కుండలు తయారు చేస్తున్నాం.

– కె.వీరాంజనేయులు, మంగళగిరి

నిరుపయోగంగా మరుగుదొడ్లు



తాడికొండ: తాడికొండ గాంధీ పార్కులో కేంద్ర ప్రభుత్వ నిధులు రూ.5 లక్షలు వెచ్చించి మరుగుదొడ్లు నిర్మించారు. గత మూడేళ్లుగా వీటిని నిరుపయోగంగా వదిలేశారు. దీంతో ఇవి నిరుపయోగంగా మారాయి. ఆకతాయిలు తాళాలు పగలగొట్టి తలుపులు తెరిచి వదిలేయడంతో పందులు, కుక్కలు ఎలుకలు సంచరిస్తూ మరుగుదొడ్లను నాశనం చేస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. వీటిని వినియోగంలోకి తెస్తే..బస్టాండ్‌కు వచ్చే ప్రయాణికులు, ఇటు పోలీస్ స్టేషన్‌కు వివిధ పనుల నిమిత్తం వచ్చే వారికి ఉపయోగకరంగా ఉంటుందని అంటున్నారు.

కార్మికులు ఐక్యంగా పోరాడాలి

తాడేపల్లి రూరల్ : ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు ఐక్యంగా పోరాడాలని సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు పిలుపునిచ్చారు. ఆదివారంతో బ్రహ్మానందపురంలో ఏసీసీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్ష 124వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా దుర్గారావు మాట్లాడుతూ తమకు న్యాయంగా రావాల్సిన బకాయిల కోసం కార్మికులు దీక్షలు చేస్తున్నారని అన్నారు. సమస్య పరిష్కారానికి ఐక్య కార్యాచరణ, పోరాటాలే మార్గమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు కె. స్టీవెన్, కె.ఆదినారాయణ, కార్మికులు నవనీతం, యోహాను, గురవయ్య, హగ్గయ్య, ఇమాంబి, ఆశీర్వాదం, సాంబశివరావు, సుబ్బారావు, పిచ్చయ్య పాల్గొన్నారు.

ఘనంగా దివ్య సత్ప్రసాద మహా పాదయాత్ర

మంగళగిరి టౌన్ : జూబిలీ 2025 వేడుకల్లో భాగంగా గుంటూరు మేత్రాసనం, మంగళగిరి డీనరి ఆధ్వర్యంలో దివ్య సత్ప్రసాద ప్రభువునితో మహాపాదయాత్ర ఆదివారం మంగళగిరిలో నిర్వహించారు. ఈ సందర్భంగా గురుమండల అధికారి ఫాదర్ ఎరువ బాల మాట్లాడుతూ ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల్లో మొట్టమొదటి సారిగా ఈ దివ్య సత్ప్రసాద మహా పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మంగళగిరిలోని డీనరి ఫాదర్స్, జేఎంజే సిస్టర్స్ ఆధ్వర్యంలో నిర్వహించామని తెలిపారు. ఉదయం 6 గంటలకు మంగళగిరి మండల పరిధిలోని బేతపూడి డివైన్ మెర్సి చర్చి వద్ద నుంచి ఈ పాదయాత్ర మొదలై మంగళగిరి పట్టణ పరిధిలోని పార్కురోడ్డులోని ఆర్‌సీఎం నిర్మల మాత దేవాలయ విచారణ సంఘస్తులను కలుపుకుని ఆత్మకూరు నిర్మల కాన్వెంట్ వద్దకు చేరుకుంది. పెదవడ్లపూడి పునీత మిఖాయేల్ పుణ్యక్షేత్రం వరకు చేరుకుందన్నారు. అనంతరం గుంటూరు జిల్లా పీఠాధిపతులు డాక్టర్ చిన్నబత్తిన భాగ్యయ్య వాక్యోపదేశం అందించి క్రైస్తవులకు దీవెనలు అందించారు. ఈ కార్యక్రమంలో డీనరి ఫాదర్లు, సిస్టర్లు, సంఘ పెద్దలు, ఉపదేశకులు, సహాయకులు పాల్గొన్నారు.



పాదయాత్రలో పాల్గొన్న క్రైస్తవులు

ఉచిత కంటి వైద్య శిబిరంలో 150 మందికి పరీక్షలు

తెనాలి: స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర ఆహార, పౌర సరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ జన్మదినం రోజైన ఆదివారం రూరల్ మండల గ్రామం కొలకలూరులో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. గ్రేస్ ఫౌండేషన్, ఫార్చ్యూన్ రియల్టర్స్ సహకారంతో ఆ గ్రామ బీసీ కాలనీలోని జూబ్లీ హైస్కూలు ప్రాంగణంలో నిర్వహించిన వైద్య శిబిరాన్ని ప్రిన్సిపాల్ సిస్టర్ లీమా ప్రారంభించారు. ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు శిబిరాన్ని నిర్వహించారు. మ్యాక్సీవిజన్ సూపర్ స్పెషాలిటీ ఐ హాస్పటల్, విజయవాడ, తెనాలికి చెందిన న్యూక్లియర్ విజన్ ఆప్టికల్స్ ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. మొత్తం 150 మందికి పరీక్షలు చేసినట్టు నిర్వాహకులు వెల్లడించారు. నిర్వాహక సంస్థల అధిపతులు కన్నెగంటి మురళీకృష్ణ, కై తేపల్లి షాలేంరాజా, న్యాయవాది సుద్దపల్లి మురళీధర్ పర్యవేక్షించారు. కార్యక్రమంలో తోట నరేంద్ర, యడ్లపల్లి రవికిరణ్ పాల్గొన్నారు.



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న సిస్టర్ లీమా

రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్ర గాయాలు

కొల్లిపర: రోడ్డు ప్రమాదంలో మహిళ తీవ్ర గాయాలపాలైన ఘటన కొల్లిపరలో ఆదివారం చోటుచేసుకుంది. గ్రామంలోని హోలీ క్రాస్ స్కూలు వద్ద కేసన కోటేశ్వరమ్మ రోడ్డు దాటుతుండగా బైక్ ఢీకొట్టడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు ఆమెను కొల్లిపర వైద్యశాలకు తీసుకెళ్లగా, మెరుగైన వైద్యం కోసం గుంటూరు సమగ్ర వైద్యశాలకు పంపారు. వాహనాన్ని మైనర్లు నడిపినట్టు సమాచారం. ఘటనపై కొల్లిపర పోలీసులు విచారిస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రీరామనవమి వేడుకలు



వేడుకగా సీతారాముల ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు



శ్రీరామ నవమి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న మహిళా భక్తులు

తాడేపల్లి రూరల్: తాడేపల్లిలోని స్థానిక ఆర్ఎస్ సిగ్మా పారామౌంట్ అపార్ట్‌మెంట్‌లో శ్రీరామనవమి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. సీతారాములకు ప్రత్యేక పూజలనంతరం పాతూరు రోడ్డులో శ్రీరాముని ఊరేగింపును భక్తులు వేడుకగా చేపట్టారు. మహిళలు కోలాటం ప్రదర్శిస్తూ.. ముందుకు సాగారు. జై శ్రీరామ్ అని నినాదాలు చేస్తూ భక్తిపారవశ్యంలో మునిగిపోయారు

ట్రాఫిక్ జామ్‌లో వివాదం..వ్యక్తిపై దాడి

తాడేపల్లి రూరల్ : మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని పాత జాతీయ రహదారిపై ఉండవల్లి సెంటర్‌వద్ద ట్రాఫిక్ జామ్ అయ్యింది. ఆ ట్రాఫిక్ జామ్‌లో కొంతమంది యువకులు రెచ్చిపోయి ఒక వ్యక్తిని తీవ్రంగా కొట్టి గాయపరిచిన సంఘటన ఆదివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సేకరించిన వివరాల ప్రకారం ఉండవల్లి సెంటర్‌లో శనివారం ట్రాఫిక్ నిలిచిపోయింది. ఆ ట్రాఫిక్‌లో పోలకంపాడుకు చెందిన వంగ నరేష్ యువకుడు ఆగిపోగా, వెనుక తాడేపల్లికి చెందిన బన్ని అనే యువకుడు, కొంతమంది వచ్చి బైక్ నిలిపారు. వంగ నరేష్ ద్విచక్రవాహన్ని వెనుక నుంచి గుద్దడంతో అతను ఈ విషయంపై వారిని ప్రశ్నించాడు. దీంతో బన్ని అతనితో పాటు ఉన్న ఇద్దరు యువకులు నరేష్‌పై విచక్షణారహితంగా దాడిచేసి గాయపరిచారు. నరేష్‌కు తీవ్రంగా గాయాలు కావడంతో స్థానికులు వైద్య నిమిత్తం ఆసుపత్రిలో చేర్పించారు. ఇదిలా ఉండగా కొంతమంది రాజకీయ నాయకులు ఈ ఘటనపై రాజీ చేసేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఇందులో ఒక మైనర్ తరచు ద్విచక్ర వాహనలపై తిరుగుతూ పలువురిపై గొడవకు దిగుతూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారని పలువురు చెబుతున్నారు.



గాయపడిన వంగ నరేష్

చూసిన కనులదే భాగ్యం

- ఘనంగా శ్రీరామనవమి వేడుకలు
- కనుల పండువగా సీతారాముల కల్యాణ మహోత్సవం
- భక్తుల రాకతో కిటకిటలాడిన రామాలయాలు
- ప్రత్యేక పూజలు, భారీ అన్నదానాలు

తాడేపల్లి రూరల్: శ్రీరామనవమి వేడుకలు ఆదివారం అంగరంగ వైభవంగా జరిగాయి. తాడేపల్లి పట్టణం సీతానగరం ప్రభాత ఆంజనేయస్వామి దేవాలయంలో సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా నేషనల్ కన్స్యూమర్స్ రైట్స్ కమిషన్ చైర్మన్ మంజు భవాని పాల్గొన్నారు. భక్తులకు అన్నదానం చేశారు.పల్లి నాగేశ్వరరావు, లంకా వంశీ, సూరి రఘు, తోట పాల్గొన్నారు.

- సీతానగరంలోని కోదండరామ సమేత శ్రీమద్వీరాంజనేయస్వామి ఆలయం ఎదుట ప్రత్యేకంగా చలువ పందిరి ఏర్పాటు చేసి సీతారాముల కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. దేవదాయ శాఖ అదనపు కమిషనర్ కె. రామచంద్ర మోహన్ స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. భక్తులకు అన్నదానం చేశారు. అర్చకులు మారుతి ఆచార్యులు, శ్రీనివాసాచార్యులు, సత్యకుమార్, సుప్రకాష్ శర్మ పాల్గొన్నారు.
- తాడేపల్లి పట్టణ, రూరల్ పరిధిలోని అన్ని ఆలయాల్లో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మహానాడులో గోగుల శ్రీను ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణ మహోత్సవం నిర్వహించి, భారీ అన్నదానం చేశారు.ఉండవల్లిలో రెడ్ల రామమందిరం వద్ద సీతారామచంద్రులకు గ్రామోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కన్వీనర్ దొంతిరెడ్డి వేమారెడ్డి, పట్టణ అధ్యక్షుడు బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీరామ నవమి వేడుకలు

ఫిరంగిపురం: మండలంలోని పలు గ్రామాల్లో శ్రీరామ నవమిని ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఆలయాల్లో సీతారాముల కల్యాణం వైభవంగా ఆదివారం నిర్వహించారు. ఫిరంగిపురంలోని కోదండరామాలయం, వేమవరంలోని రామాలయంలో వేద పండితులు శాంతి కల్యాణం జరిపించారు. శిరంగిపాలెంలోని ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో విశేష పూజలు చేశారు. వడపప్పు, పానకం భక్తులకు అందజేశారు. తక్కెళ్లపాడు కోదండ రాముడికి త్రయాహ్నిక కల్యాణం నిర్వహించారు. రేపూడిలోని పట్టాభిరామస్వామికి అర్చకులు కృష్ణమూర్తి పూజలు చేసి శాంతి కల్యాణం నిర్వహించారు.

మంగళగిరి టౌన్: మంగళగిరి పట్టణ పరిధిలోని శ్రీరామాలయాలు జై శ్రీరామ్ అంటూ మారుమోగాయి. శ్రీరామనవమి సందర్భంగా ఆదివారం ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. మంగళగిరి పట్టణ పరిధిలోని మురుగుడు హనుమంతరావు బజారులోని గోలిలింగయ్య గారి రామమందిరంలో ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు శ్రీరామనవమి వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. మంగళగిరి రత్నాలచెరువు వద్ద ఉన్న రామాలయంలో వైఎస్సార్ సీపీ మంగళగిరి సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి శ్రీరామనవమి వేడుకల్లో పాల్గొన్నారు. సీతారామ కోవెల ఆలయంలో ఉదయం ఎదురుకోల ఉత్సవాన్ని నిర్వహించారు. రాజీవ్ గృహకల్ప, మెయిన్ బజార్‌లోని పట్టణ ఆర్యవైశ్య సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో సీతారామస్వామి దివ్య కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు.

మహోత్సవం

మంగళగిరి: నగర పరిధిలోని పెదవడ్లపూడి సాయిబాబా ఆలయంలో సీతారాముల కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. సీతారాముల కళ్యాణాన్ని నిర్వహించి, భక్తులకు అన్నప్రసాదం వితరణ చేశారు. శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో జరిగిన సీతారాముల కల్యాణ మహోత్సవంలో మార్కెట్ యార్డు చైర్మన్ జవ్వాది కిరణ్ చందు పాల్గొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

తాడికొండ: శ్రీరామ నవమి పర్వదిన వేడుకలను పురస్కరించుకొని తాడికొండ, తుళ్లూరు మండలాల్లో వేడుకలు ఘనంగా నిర్వహించారు. కనుల పండువగా సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులకు పానకం, వడపప్పు ఫలహారాలు అందజేశారు. తాడికొండ రెడ్ల రామాలయంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు.



సీతారాముల కల్యాణోత్సవంలో నేషనల్ కన్స్యూమర్స్ రైట్స్ కమిషన్ చైర్మన్ మంజు భవాని



గోలిలింగయ్య గారి రామ మందిరంలో ఎమ్మెల్సీ మురుగుడు, సత్యం పూజలు



సీతానగరం శ్రీమద్వీరాంజనేయస్వామి ఆలయం సీతారాముల కల్యాణం



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ సమన్వయకర్త డీవీఆర్



ఫిరంగిపురంలో సీతారాముల కల్యాణం



కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న దంపతులు



సీతారాముల కోవెలలో స్వామివారి కల్యాణ మహోత్సవం తిలకిస్తున్న భక్తులు



సీతారాముల కల్యాణ మహోత్సవం



వడ్లపూడి సాయిబాబా ఆలయంలో సీతారాములకి పూజలు

కిడ్నీ వ్యాధి బాధితురాలికి నిత్యావసర సరుకులు పంపిణీ

తెనాలి టౌన్: అనారోగ్యంతో బాధపడుతున్న కిడ్నీ వ్యాధి బాధితురాలికి శ్రీ ఆంజనేయ ధ్యాన యోగా మండలి ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు పంపిణీ చేయడం అభినందనీయమని 2వ జూనియర్ సివిల్ జడ్జి రాజశేఖర్ కొనియాడారు. స్థానిక కొత్తపేటలోని విశ్వకర్మ దేవాలయ ఆవరణలో ఆదివారం శ్రీరామనవమి పండుగ సందర్భంగా దేవస్థానం వద్ద చలివేంద్రం ఏర్పాటు చేశారు. 2వ జూనియర్ సివిల్ జడ్జి రాజశేఖర్ ప్రారంభించారు. అనంతరం కిడ్నీ వ్యాధి బాధితురాలికి నిత్యావసర సరుకులు అందజేశారు. రెండు కిడ్నీలు పాడై బాధపడుతున్న లలితకుమారికి ప్రతి నెలా 10కిలోల బియ్యం ధ్యాన యోగ మండలి ద్వారా అందజేస్తున్నట్లు కిశోర్ గురూజీ తెలియజేశారు. కార్యక్రమంలో దాతలు వీరయ్య, రాజారెడ్డి, వివేకానంద మూర్తి, యోగా సభ్యులు తాడికొండ శ్రీనివాసరావు, నాగరాజు, కోమలాదేవి, ఎం.శ్రీనివాసరావు, సూర్యనారాయణ, సుబ్బారావు, ఇస్మాయేల్, రాంబాబు, విద్యకుమారి పాల్గొన్నారు.